క్లుప్తంగా

హైవేపై కారు బోల్తా



ఎర్రవల్లి: జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని కారు బోల్తా పడిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాలు.. అలంపూర్ మండలంలోని క్యాతూరుకు చెందిన ఇద్దరు వ్యక్తులు కారులో కొల్లాపూర్‌కు వెళ్తుండగా జాతీయ రహదారిపై నారాయణపురం స్టేజీ వద్ద కారును వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో కారు ఒక్కసారిగా పల్టీలు కొడుతూ అదుపు తప్పి బోల్తాపడింది. ప్రమాదంలో కారు పూర్తిగా ధ్వంసం కాగా.. ఇద్దరు తేలికపాటి గాయాలతో బయటపడ్డారు.

భగీరథ పైప్‌లైన్ లీకేజీ



ఉండవెల్లి: మండలంలోని బొంకూరు గ్రామంలోని రోడ్డు పక్కన మిషన్ భగీరథ పైప్‌లైన్ కనెక్షన్‌కి తాడు కట్టడంతో గాలికి ఎయిర్‌వాల్ ఎగిరిపడి నీరు అమాంతం 40 అడుగుల ఎత్తుకు ఎగిసిపడ్డాయి. దీంతో ప్రయాణికులు, వాహనదారులు ఆందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన అధికారులు మరమ్మతులు చేపట్టారు.

కులవివక్షను పాటించొద్దు



గట్టు: కుల వివక్షను పాటింకుండా, అన్ని వర్గాల వారు కలసి మెలసి జీవించాలని తహసీల్దార్ సలీముద్దీన్ అన్నారు. పౌర హక్కుల దినోత్సవంలో భాగంగా బుధవారం సల్కాపురం గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కుల వివక్షతను పాటించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో అందరూ కలసిమెలసి పండుగలు జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గిర్దావర్ రాజు, కానిస్టేబుల్ స్వామిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే



మల్దకల్: మండలంలోని కుర్తిరావల్‌చెర్వు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లను బుధవారం ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంపీఓ రాజశేఖర్ పరిశీలించారు. గ్రామంలో 17 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు కాగా లబ్ధిదారుల ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ గడువు పొడగింపు

శాంతినగర్: ఎల్‌ఆర్‌ఎస్ స్కీం కింద ప్లాట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం కల్పించిన 25 శాతం రాయితీ మరో మూడు రోజుల పాటు పొడిగించినట్లు మున్సిపల్ కమిషనర్ రాజయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. మేనెల 3వ వరకు అవకాశం ఉందన్నారు. వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ప్లాట్ల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



కేటీదొడ్డి: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం గోపాల్ అన్నారు. మండల పరిధిలోని గువ్వలదిన్నె, నందిన్నెలో ఐకేపీ ఆధ్వర్యంలోని ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈఓ మమత, నాయకులు వెంకటేష్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, శ్రీపాదరెడ్డి, బహదూర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

‘పది’లో మెరిసిన ప్రభుత్వ విద్యార్థులు


అక్షయ (576)


భార్గవి(558)


మధుకుమార్(550)


మల్లికార్జున్(542)


శివ(548)

సాక్షి నెట్‌వర్క్: పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బుధవారం వెలువడిన పరీక్షా ఫలితాల్లో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, రెసిడెన్సియల్ పాఠశాలల్లో ఉత్తమ మార్కులు సాధించారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లా, మండల టాపర్లుగా నిలిచారు.

☆ అలంపూర్ మండలంలో 97.90 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ అశోక్ కుమార్ తెలిపారు. 333 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 326 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి కే.హేమంత్‌కు 538 మార్కులు, బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని సి.గీత 531 మార్కులు వచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 91.67 శాతం ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. బాలికల ఉన్నత పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. జెడ్పీహెచ్‌ఎస్ న్యూప్లాట్స్‌లో వంద శాతం ఉత్తీర్ణత, జెడ్పీహెచ్‌ఎస్ హరిజనవాడ పాఠశాలలో 96.30 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

అలంపూర్ పట్టణంలోని మాంటిస్సోరీ పాఠశాలలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి తెలిపారు. కర్నె పూజిత 538 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచినట్లు పాఠశాల డైరెక్టర్ కేఎస్‌వీ రవిప్రకాష్ పేర్కొన్నారు. అదే విధంగా విశ్వశాంతి పాఠశాలలో వంద శాత ఉత్తీర్ణత సాధించినట్లు విశ్వశాంతి విద్యా సంస్థల చైర్మన్ మురళీధర్ రెడ్డి తెలిపారు.

☆ ధరూరు మండలంలోని గుడ్డెందొడ్డి ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఎస్ రెసిడెన్సియల్(అలంపూర్) గురుకుల పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. రేవులపల్లి, గార్లపాడు ఉన్నత పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ రవీంద్రబాబు తెలిపారు. అదే విధంగా మిగిలిన పాఠశాలలైన జెడ్పీహెచ్‌ఎస్ ధరూరు 75శాతం, జెడ్పీహెచ్‌ఎస్ మార్లబీడు 87 శాతం, ఎంపీహెచ్‌ఎస్ అల్వలపాడు 96 శాతం, కేజీబీవీ ధరూరు 98 శాతం ఫలితాలు సాధించాయి. ధరూరు ఉన్నత పాఠశాలకు చెందిన సుహానా సిద్రకు 530 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది.

☆ మానవపాడు ఉన్నత పాఠశాలలో 79 మంది విద్యార్థులకు గానూ 72మంది విద్యార్థులైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. జల్లాపురం పాఠశాలలో 65 మంది విద్యార్థులు, చెన్నిపాడు పాఠశాలలో 25 మంది, కేజీబీవీ పాఠశాలలో 31మంది విద్యార్థులు ఉత్తీర్ణలైనట్లు ఎంఈఓ శివప్రసాద్ తెలిపారు. మండలంలో కేజీబీవీ పాఠశాల విద్యార్థి సునీత 527 మార్కులు సాధించినట్లు తెలిపారు.

☆ కేటీదొడ్డి మండలంలోని కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. కొండాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో 91 శాతం, పాతపాలెం పాఠశాలలో 90 శాతం, ఇర్కిచేడు పాఠశాలలో 34 శాతం, చింతలకుంట పాఠశాలలో 83 శాతం, నందిన్నె పాఠశాలలో 64 శాతం, కుచినెర్ల పాఠశాలలో 45 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. మండల టాపర్‌గా 574 మార్కులతో చరణ్, మండల సెకండ్ టాపర్‌గా 568 మార్క్‌లతో చరణ్‌కుమార్ పాతపాలెం పాఠశాల విద్యార్థి సాధించినట్లు ఎంఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

☆ మల్దకల్ మండలంలోని పది జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో 78.92 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ తెలిపారు. మండల టాపర్‌గా మద్దలబండ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని అఖిల 514 మార్కులు సాధించినట్లు తెలిపారు.

☆ రాజోళి మండలంలో 98 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 72 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ భగీరథరెడ్డి తెలిపారు.

☆ ఎర్రవల్లి మండలంలో 96.9 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి అమీర్‌పాష తెలిపారు. బీచుపల్లి గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి మధుకుమార్ 550 సాధించి మండల టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు.

☆ ఇటిక్యాల మండలంలో 95.5 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. గురుకుల పాఠశాలకు చెందిన జశ్వంత్‌రాజ్ 569, మల్లికార్జున్ 542 మార్కులు సాధించినట్లు తెలిపారు. అదే విధంగా జిల్లా పరిషత్ ఇటిక్యాల, జిల్లా పరిషత్ చాగాపురం పాఠశాలలో 100 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

☆ ఉండవెల్లి మండలంలో 97 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ రామకృష్ణ తెలిపారు. పుల్లూరు గురుకుల పాఠశాల విద్యార్థిని భార్గవి 558 600, శ్రీలేఖ 552 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ దేవానందం తెలిపారు.

☆ గట్టు మండలంలోని మొత్తం 12 ఉన్నత పాఠశాలల్లో 7 ఉన్నత పాఠశాలల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. గురుకుల పాఠశాల విద్యార్థిని అక్షయ 576 సాధించి మండల టాపర్‌గా నిలిచినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

సైబర్ సెక్యూరిటీ విభాగంలో సేవలందిస్తా ..



కష్టపడి ఉన్నత చదువులు చదివి సైబర్ సెక్యూరిటీ విభాగంలో ఉన్నతమైన సేవలందిస్తా. అమ్మానాన్నలు కష్టపడి నన్ను చదివిస్తున్నారు. వారి కష్టార్జితాన్ని వృధాకానివ్వను. నాకు చదువులో ఉపాధ్యాయులతో పాటు నా కుటుంబం అండగా నిలిచింది. మా అక్కలిద్దరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యను అభ్యసించి ఉన్నత చదువులు చదువుతున్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని 569 మార్కులు సాధించాను.

- కె. జశ్వంత్, ఇటిక్యాల

ఇంజినీర్‌నవుతా..



ఇంజినీరింగ్ విభాగంతో స్థిరపడాలని నా కోరిక. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం మాది. అమ్మానాన్నలు వివిధ షాపుల్లో పని చేస్తూ నన్ను చదివించారు. 568 మార్కులు సాధించడం సంతోషంగా ఉంది. అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

-పి. చరణ్‌కుమార్‌రెడ్డి, ర్యాలంపాడు

సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడతా..



నాన్న మార్క్ సెంట్రింగ్ పని చేస్తూ మమ్మల్ని పోషిస్తున్నారు. అమ్మానాన్నల కష్టం చూసి పట్టుదలగా చదివా పదో తరగతి ఫలితాల్లో 574 మార్కులు సాధించడం ఆనందంగా ఉంది. టీచర్ సుభాషిణి మేడం సహకారం మరువలేనిది. సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడాలని నా కోరిక.

- ఎస్ చరణ్, గట్టు చాగదోణ

ఘనంగా బసవ జయంతి వేడుకలు


ఇటిక్యాలలో నివాళులర్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది


గట్టు తహసీల్దార్ కార్యాలయంలో బసవ జయంతి నిర్వహిస్తున్న అధికారులు

అయిజ: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ జ్యోతి బసవ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి, ఆయన జీవిత చరిత్ర గురించి వివరించారు. బసవన్న తన వచనాల ద్వారా సామాజిక నీతి, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సరళమైన కన్నడ భాషలో ప్రజలకు అందించారని పేర్కొన్నారు. అనుభవ మంటపం అనే సభను స్థాపించి, సమాజంలోని అన్ని వర్గాల వారిని ఒకచోట చేర్చి చర్చలు జరిపించారని తెలిపారు. కార్యాలయంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇటిక్యాల: సమాజ శ్రేయస్సు కోసం పాటుపడిన వ్యక్తి బసవేశ్వరుడని తహసీల్దార్ భద్రప్ప అన్నారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో బసవేశ్వర జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీటీ నందిని, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గట్టు: బసవేశ్వర జయంతి వేడుకల మండల కేంద్రంలో ఘనంగా జరుపుకున్నారు. బస్టాండ్ ఆవరణలోని గ్రామ పంచాయతీ దగ్గర బసవేశ్వర చిత్రపటాన్ని ఏర్పాటు చేసి, పూలమాలలు వేశారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సలీముద్దీన్ బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో అమరేష్, రాజప్ప, నాగప్ప, నాగయ్య, రేష్, సుధీర్, భరత్‌కుమార్, అశోక్, సిద్ధప్ప, వెంకటేష్, మహాదేవ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.21.48 లక్షలు పలికిన తైబజార్ వేలం



అయిజ: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ సీహెచ్ సైదులు, టీపీఓ వర ప్రసాద్ 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తైబజార్ వేలం నిర్వహించారు. దీనికోసం ఇద్దరు కాంట్రాక్టర్లు దరఖాస్తు చేసుకున్నారు. మే 1– 2025 సంవత్సరం నుంచి మార్చి 31– 2026 సంవత్సరం వరకు (11 నెలలు) వేలాన్ని కాంట్రాక్టర్ వి. రవీందర్ రూ.21,48,000కు దక్కించుకున్నారు.

మిత్రుడి కుమార్తె పెళ్లికి ఆర్థిక సాయం



గట్టు: మృతి చెందిన స్నేహితుడి కుమార్తె పెళ్లికి ఆర్థిక సాయం చేసి ఉదారతను చాటుకున్నారు ధరూరు ఉన్నత పాఠశాల 1996–97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు. మండలంలోని రాయాపురం గ్రామానికి చెందిన రాజు ధరూరు హాస్టల్‌లో పదో తరగతి పూర్తి చేశాడు. ఈ నేపథ్యంలో 10 ఏళ్ల క్రితం రాజు విద్యుదాఘాతంతో మృతి చెందగా, రాజు భార్య గోవిందమ్మ 6 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. వారి కుమార్తె పవిత్ర వివాహం సందర్భంగా పవిత్ర తండ్రి రాజు పదో తరగతి స్నేహితులు బుధవారం రూ.51,500 ఆర్థిక సాయం చేసి పెద్ద మనసు చాటుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ధరూరు మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బండ్ల వెంకటేశ్వర్‌రెడ్డి, జగదీష్, ఆంజనేయులు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు కవిత్వాన్ని రక్షించిన శ్రీశ్రీ

వనపర్తి విద్యావిభాగం: అభ్యుదయ కవితా వైతాళికుడు విప్లవ కవిత బోధకుడు శ్రీశ్రీ 115 జయంతి వేడుకలను మహనీయుల స్ఫూర్తి వేదిక ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భూరోజు గిరిరాజాచారి, మండ్ల దేవన్ననాయుడు, వెంకటేష్, ఎర్రం భాస్కర్, రాంబాబు, తదితరులు ఉన్నారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు


కమాండెంట్ దంపతులను సన్మానిస్తున్న అధికారులు

ఎర్రవల్లి: ఉత్తమ సేవలతోనే ప్రతి ఉద్యోగికి గుర్తింపు లభిస్తుందని.. తెలంగాణ ప్రత్యేక పోలీస్ విభాగంలో పదో బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య ఎన్నో కఠినమైన విధులు నిర్వహించి పదవీ విరమణ పొందుతున్నారని పదో బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ జయరాజు అన్నారు. బుధవారం మండలంలోని బీచుపల్లి పదో బెటాలియన్‌లో ఏర్పాటు చేసిన కమాండెంట్ పదవీ విరమణ సభకు ఆయన హాజరై అధికారులతో కలిసి కమాండెంట్ దంపతులకు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 1984లో ఎపిఎస్పీ విభాగంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లో చేరిన ఆయన దాదాపు 41 సంవత్సరాల పాటు రాష్ట్ర ప్రత్యేక పోలీస్ విభాగంలో వివిధ పదవులను అలంకరించి వృత్తిలో ఎలాంటి మచ్చ లేకుండా సేవలిందించారని అన్నారు. ఎన్నో కఠినమైన ప్రదేశాలతో పాటుగా యాంటీ నక్సల్స్ ఏరియాలలో కూడా ఆయన ఎంతో చాకచక్యంగా విధులు నిర్వహించారన్నారు. ఎంతో మంది సీఎంలు, మంత్రుల దగ్గర భద్రతా విభాగంలో ఉంటూ ఎలాంటి లోపాలు తలెత్తకుండా ఆయన పనిచేశారని అన్నారు. వివిపి, వివిఐపి ల భద్రత విధులను నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ కమాండెంట్ వేణుగోపాల్, అసిస్టెంట్ కమాండెంట్ లు నరేందర్‌రెడ్డి, పాణి, ఆర్ఐ లు రాజు, రాజారావు, రమేష్‌బాబు, శ్రీదర్, పటాలం సిబ్బంది, తదితరులు ఉన్నారు.

కళ్యాణ మండప ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేలు


కళ్యాణ మండప ప్రారంభోత్సవ పూజల్లో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి


ప్రారంభోత్సవంలో రాయచూర్ ఎమ్మెల్యే దద్దల బస్సన్నగౌడ్

కేటీదొడ్డి: పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి కోరిన కోర్కెలు తీరుస్తూ, భక్తుల కొంగు బంగారంగా వెలుగొందుతున్నడని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ అన్నారు. బుధవారం మండలంలోని వెంకటాపురం గ్రామంలోని వెలసిన పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయంలోని నూతనంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, రాయచూర్ ఎమ్మెల్యే దద్దల బస్సన్నగౌడు, జిల్లా బీఆర్ఎస్ నాయకులు బాసు హనుమంతునాయుడు, జెడ్పీ మాజీ చైర్మన్ సరిత హాజరై రిబ్బన్ కట్ చేశారు. లాంఛనాలతో ఎమ్మెల్యేలుకు అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ హనుమంతు, మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్, మాజీ వైస్‌ఎంపీపీ రామకృష్ణనాయుడు, నాయకులు ఉరుకుందు, టీచర్ గోవిందు, చంద్రశేఖర్, ఆంజనేయులు, వెంకన్‌గౌడు, శేఖర్ రెడ్డి, రాజేష్, వెంకటేష్‌నాయుడు, రఘురెడ్డి, గోపి పాల్గొన్నారు.

ఎస్డీఆర్‌ఎస్ ఉద్యోగుల గోడు పట్టదా


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

మానవపాడు: ఎస్డీఆర్‌ఎస్ ఉద్యోగులు వేతనాలు సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారని మండల జేఏసీ సభ్యులు బుధవారం ఎంపీడీఓ భాస్కర్‌కు వినతిపత్రం అందించారు. ఏప్రిల్ నెలతో మూడు నెలల వేతనం పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జనగామ జిల్లాలో ఒక ఈసీ మరణిస్తే బిల్లులు చెల్లించారని, అంటే అందరూ ఉద్యోగులు మరణిస్తే జీతాలు ఇస్తారా అని ప్రశ్నించారు. అధికారుల ఆదేశానుసారం సెలవు దినాల్లో కుడా పనులు చేస్తున్నా వేతనాలు సకాలంలో అందించకపోవడం దారుణమన్నారు. పేస్కేల్ ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదన్నారు. కార్యక్రమంలో ఏపీఓ విజయశంకర్, జేఏసీ నాయకులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి


పరామర్శిస్తున్న ప్రేమ్‌కుమార్


గాయపడిన వారిని పరామర్శిస్తున్న స్నిగ్ధారెడ్డి

గద్వాల: రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి అన్నారు. బుధవారం ఆమె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో బొలేరో వాహనం ఢీకొట్టిన ఘటనలో గాయపడిన బీఫార్మసీ విద్యార్థులను పరామర్శించారు. అనంతరం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. గద్వాల పట్టణంలో ట్రాఫిక్ సమస్య నెలకొందన్నారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టి ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, రాంచంద్రారెడ్డి, అక్కల రమాదేవి, శివారెడ్డి, జయశ్రీ, చిత్తారికిరణ్, దేవదాసు, నర్సింహ, తరుణ్ పాల్గొన్నారు.

ఎర్రవల్లి: జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న నర్సింగ్ విద్యార్థులను సామాజిక విప్లవకారుడు డాక్టర్ ప్రేమ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. ప్రమాదంలో మృతి చెందిన నర్సింగ్ విద్యార్థుల కుటుంబాలకు వెంటనే రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియాను చెల్లించాలని, వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అందరివాడు

ఆత్మకూర్: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీంరావ్ బాబసాహేబ్ అంబేడ్కర్ ఏ ఒక్క కులానికి చెందిన వారు కాదని దేశంలోని అన్ని కులాలకు, మతాలకు చెందిన అందరివాడని మక్తల్ ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం ఆత్మకూర్ మండలంలోని తూంపల్లిలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణలో పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచిందని, తమలాంటి వారందరికి ఆ మహనీయుడి వల్లే పదవులు వచ్చాయని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో విండో అధ్యక్షులు గాడి కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాలకిష్టన్న, మహేశ్వర్‌రెడ్డి, గాలిపంపు శ్రీను, అంబేడ్కర్ సంఘం నాయకులు ఉన్నారు.

శిథిలావస్థలో గ్రంథాలయాలు

- పట్టించుకోని పాలక వర్గం
- అవస్థలు పడుతున్న నిరుద్యోగులు


ఉండవెల్లిలో శిథిలావస్థలో గ్రంథాలయం

ఉండవెల్లి: జ్ఞానాభివృద్ధికి, నిరుద్యోగ యువతకు ఉపయుక్తకరంగా ఉండే గ్రంథాలయాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఇటు ప్రజలు అటు నిరుద్యోగ యువత గ్రామాల్లో అవస్థలు పడుతున్నారు. కనీసం పత్రికలు చదవడానికి కూడా వీలు లేకుండా భవనాలు ఉన్నాయంటూ వాపోతున్నారు. ఎప్పుడు భవనాల పైకప్పు పెచ్చులూడి పడతాయంటూ భయాందోళనలో ఉన్నారు.

పర్యవేక్షణ లేమి..

మండలంలోని ఇటిక్యాలపాడు గ్రామంలో 44 ఏళ్ల నాటి గ్రంథాలయం ఉంది. 1981లో మాజీ ఎమ్మెల్యే కీ.శే.సురవరం ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. ఉండవెల్లిలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రారంభించిన గ్రంథాలయాలను పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ముఖ్యంగా గ్రంథాలయాల్లో పుస్తకాల కొరత ఉంటుందన్నారు. పోటీ పరక్షలకు ఉపయోగ పడే పుస్తకాలు కూడా అందుబాటులో లేవని విమర్శిస్తున్నారు. గ్రంథాలయ భవనాల పైకప్పు పెచ్చులూడిపడుతున్నట్లు పేర్కొన్నారు. అధికారుల నిర్వహణ లేమి నిర్లక్ష్యం కారణంగా ప్రజలు, నిరుద్యోగులు అవస్థలు పడుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, పాలకులు స్పందించి గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేయాలని కోరుతున్నారు.


ఇటిక్యాలపాడులో శిథిలావస్థకు చేరిన గ్రంథాలయం

నిధులు మంజూరు చేయాలి..



గ్రంథాలయాలకు నిధులు మంజూరు చేసి యువతకు ఉపయోగకరంగా మార్చాలి. ముఖ్యంగా పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, పత్రికలు అందుబాటులో ఉంచాలి.

- వెంకటేష్, ఉండవెల్లి

అభివృద్ధి చేయాలి



ప్రతి గ్రామంలో గ్రంథాలయాలు అభివృద్ధి చేసి యువతకు అందుబాటులో ఉంచాలి. గ్రామీణ యువతలో పోటీ పరీక్షలకు, మేథోశక్తిని పెంపొందించేందుకు అధికారులు కృషి చేయాలి.

- వెంకటేష్, చిన్న ఆముదాలపాడు